# తెగులు వాచకము



మా నిర్భయ్ నగర్ కాలనీలో రాజకీయ కల్లోలం పూర్తిగా సద్దుమణిగిపోయింది. కొన్ని రోజులపాటు కాలనీలో మీటింగులూ, హడావుడులూ లేకుండా కాలనీని ప్రశాంతంగా ఉంచమని కాలనీ వాళ్ళు చాలా మంది ఆర్గనైజింగ్ సెక్రెటరీ శాయిరామ్‌ని అభ్యర్థించారు. అలాగేనని శాయిరామ్ వారికి హామీ ఇచ్చాడు గానీ– అలా ఏ కార్యక్రమమూ లేకుండా కాలనీని ప్రశాంతంగా ఉంచటం అతనికేంమాత్రం నచ్చలేదని అతని మొఖ కవళికలు చెప్తూనే ఉన్నాయ్.

కాలనీ రెండు రోజులు నిజంగానే ఎలాంటి గొడవలూ లేకుండా గడచిపోవటం చూసేసరికి నాకే ఆశ్చర్యం కలిగింది. ఆ రెండు రోజులూ శాయిరామ్ చాలా అశాంతిగా కాలనీలో ఒంటరిగా రాత్రి పొద్దుపోయే వరకు తిరగటం కిటికీ సందుల్లోంచి గమనించాను.

ఇంకేం ఫరవాలేదనీ, శాయిరామ్ ఆ ప్రశాంతతకు అలవాటు పడిపోయాడనీ కనుక ఇంకేమి డిస్టర్బెన్స్ ఉండదనీ నమ్మకం కలిగాక– నా కిష్టమయిన మంచి నవలలు లైబ్రరీ నుంచి తెచ్చుకున్నాను రోజూ– చదువుకోడానికని!

ఆ రోజు ఆదివారం.

"అందమయిన నిశ్శబ్దం" అనే నవల నాలుగు పేజీలు చదివానో లేదో– హఠాత్తుగా బయట కేకలు వినిపించినయ్. కాలనీ వాళ్లందరూ పరుగెడుతున్న చప్పుడు! గుండె ఝల్లుమంది.

కాలనీలో మళ్ళీ ఏదో అవాంతరం ముంచుకొచ్చిందనది తేలిపోయింది. అయినా పట్టించుకోకుండా నవల చదవడానకి ప్రయత్నించాను గానీ– మా తలుపు పగలగొట్టినంతగా బాదటం– వినిపించేసరికి వెళ్ళి తలుపు తెరవక తప్పలేదు. గోపాల్రావ్ నిలబడి ఉన్నాడక్కడ.

"త్వరగా పద! యాదగిరి పిలుస్తున్నాడు!" అన్నాడు.

"ఏం జరిగింది?"

"ఏమో తెలీదు? అర్జంటుగా అందరినీ పిలుచుకురమ్మన్నాడు."

ఇంక తప్పదని అతనితో బయల్దేరాను.

అప్పటికే ఆడా మగా, పిల్లా, పీచూ అందరితో క్రిక్కిరిసిపోయిందా ప్రాంతమంతా!

మధ్యలో శాయిరామ్, రంగారెడ్డి, జనార్ధన్ నిలబడ్డారు. వాళ్ళ ముందు యాదగిరి, అతని భార్యా దిగాలుపడి కూర్చున్నారు. ఓ పక్కగా యాదగిరి వాళ్ళ రెండో అబ్బాయ్ ఉండుండి ముక్కుతుడుచుకుంటూ, జారిపోతున్న నిక్కరుని ఓ చేత్తో పైకి లాక్కుంటున్నాడు. చాలా భయంగా, ఆందోళనగా కనబడుతున్నాయ్ వాడి చిన్నారి ముఖంలో.

శాయిరామ్ మైక్ ముందుకొచ్చి నిలబడ్డాడు.

"సోదర సోదరీమణులారా! నిజానికి వారం రోజుల పాటు కాలనీని ప్రశాంతంగా ఉంచాలని చాలా మంది నన్ను హెచ్చరించారు! వారి కోరిక నెరవేర్చాలనే నేనూ ప్రయత్నించాను! కానీ ఇంతలో ఇదుగో! యాదగిరికో విషమ సమస్య ముంచుకొచ్చింది. మీరంతా నిశ్శబ్దంగా ఉంటే ఆ సమస్యేమిటో చెప్తాను" అన్నాడు ఆనందంగా.

అంతా నిశ్శబందం అలుముకుంది. శాయిరామ్ యాదగిరి కొడుకుని ఎత్తుకుని స్టేజి మీద మైకు ముందు నిలబెట్టాడు.

"చెప్పరా రమేష్! నిన్న స్కూల్లో ఏం జరిగింది?" అడిగాడు శాయిరామ్.

"గిలి బక వలె సిల మరి కథ రుబ మనతసావలె!" అన్నాడు వాడు.

అందరూ విభ్రాంతితో ఒకరు మొఖం ఒకరు చూసుకున్నారు.

యాదగిరి భార్య కన్నీళ్ళతో పక్కనున్న డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరి మీద వాలిపోయింది.

"ఇదే మాట అక్కా! పరేషాన్జేస్తుండు! అన్నీ గిసంటి మాటలే! మాకేమీ సమజ్ కావటం లేదు! ఉన్నదిద్దరు పోరలు! అందులో ఈడిట్ల పిచ్చి పట్టినెక్క జేస్తుండు!" ఏడుపు అతికష్టం మీద ఆపుకుంటూ అందామె.

"సైలెన్స్" అంటూ అరచాడు శాయిరామ్.

"ఒరే రమేష్‌- మీ టెక్ట్స్ పుస్తకంలోని తెలుగుపద్యం చదవమ్మా!"

"గిలీ పులీ- గిలీ గిలీ- పులిగిలీ- గిలిపులీ- పులిగిలీ-" అన్నాడు వాడు.

యాదగిరి కూడా కన్నీళ్ళు తుడుచుకున్నాడు వాడిని చూచి.

"ఇగో- రాత్రంత గిదే ఒరులుడు భాయ్‌! నిన్న సాయంత్రం స్కూలుకెళ్ళి రాంగనే షురూ జేసిండు గీ మాటలు! నేను నా భార్య పరేషాన్‌! బరాల్‌, దిల్లగీల గట్ట యాక్షన్‌ చేస్తుండొచ్చని ఖ్యాల్‌ చెయ్యలే! ఇయ్యాళ పొద్దుటేల్‌ లేస్తనే షురూ జేసిండు మళ్ళీ ఇదే లాంగ్వేజ్‌- మాకు బుగులు పుట్టి శాయిరామ్‌ అన్ననూ, రెడ్డన్ననూ తీసుకొచ్చినం" చెప్పాడతను.

అందరూ రమేష్‌ గాడి వంక విచిత్రంగా, భయంగా, జాలిగా చూడసాగారు.

డిటెక్టివ్‌ రాజేశ్వరి చురచరా రమేష్‌ దగ్గరకు నడిచింది. వాడి ముందు కూర్చుని వాడిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంది.

"ఒరే రమేషూ! సరిగ్గా మాట్లాడమ్మా! మనం మొన్న టీవీలో తెలుగు డ్రామా చూశాం కదూ! ఎలా వుందిరా అది?" బుజ్జగింపుతో అడిగింది.

"బలగితకమని కత వలె కర చుక తలముచ" అన్నాడు వాడు ఏడుపు మొఖంతో.

"మరా సంగతి చెప్పరేం? మొన్న హైద్రాబాద్‌ దూరదర్శన్‌ ప్రోగ్రామ్‌ చూశాడంటున్నాడు కదా అందుకే పిచ్చెక్కింది వాడికి! అందుకే అలాంటి ప్రోగ్రామ్స్‌ పిల్లలకు చూపించకూడదు. పెద్దాళ్ళం మనం చూస్తేనే రెండ్రోజుల పాటు పిచ్చి పిచ్చిగా ఉంటుంది" అంది పార్వతమ్మగారు.

రాజేశ్వరి సీరియస్‌గా ఆలోచిస్తున్నట్లు ఫోజిచ్చి లేచి నిలబడింది.

"టీవీ ప్రోగ్రాం కూడా కారణమయి ఉండవచ్చు గానీ, నాకింకో అనుమానం వస్తోంది!" అందామె.

"ఏమిటది?" అడిగాడు రంగారెడ్డి అనుమానంగా.

అందరూ ఆమె ఏం చెప్తుందా అని ఊపిరి బిగపట్టారు.

"అదే- చేతబడి!" అందామె.

అందరూ త్రుళ్ళిపడ్డారు. కొంతమంది రెండడుగులు వెనక్కివేశారు. ఇంకొంత మంది తమ పిల్లలను దగ్గరకు తీసుకున్నారు.

"వీడంటేవిపరీతమయిన ద్వేషం, పగ, కసి ఉన్న వారెవరో చేతబడి చేయించి ఉంటారు- నేను ఈ విషయంలో పరిశోధించి హంతకుడిని పట్టుకుంటాను"- అందామె డిటెక్టివ్‌ ఫోజుపెట్టి.

యాదగిరి భార్య ఆ మాటతో మరింత గాబరా పడిపోయి బిగ్గరగా ఏడ్వటం మొదలు పెట్టింది గానీ యాదగిరి ఒక్క కేక వేసి ఆమె నోరు మూయించేశాడు.

"అంతా ట్రాష్! చేతబడులూ, బాణామతులూ– అంతా బోగస్! నేను నమ్మ!" అన్నాడతను.

"అవును! బుద్ధున్న వాడెవడూ నమ్మడు!" అన్నాడు రంగారెడ్డి. రాజేశ్వరమ్మ అలాంటి ఫాల్తూ స్టేట్‌మెంట్లు బంద్ జేస్తే మంచిగుంటది!" అన్నాడు వెనుక నిలబడ్డ స్టూడెంట్స్‌లో మార్క్సిస్ట్ (ఎక్స్ట్రీమ్ లెనినిస్ట్ మీడియం గ్రూప్) వాళ్ళు.

రాజేశ్వరికి కోపం వచ్చి "ఇంకోసారి ఛస్తే ఏ కేసూ పరిశోధించను!" అంటూ చరచరా స్టేజి దిగి వెళ్ళిపోయింది.

హఠాత్తుగా శాయిరామ్ కేదో అయిడియా వచ్చినట్లుంది– వెంటనే మైక్ కోసం వెతికి– దానిముందుకెళ్ళి నిలబడ్డాడు.

"సోదర సోదరీమణులారా? చిరంజీవి రమేష్ ఇలా ఎందుకయిపోయాడో ఎవరికీ అంతుబట్టడం లేదు. హైద్రాబాద్ టీవీ ప్రోగ్రామ్స్ తరచుగా చూడడం వల్లే అలా అయిపోయాడని చాలామంది అనుకుంటున్నారు గానీ చిరంజీవి రమేష్‌కున్నది పిచ్చి కాదు కాబట్టి అలా అనుకోవడం సమంజసం కాదు. ఒక్క భాష విషయంలో తప్ప రమేష్ ప్రవర్తన అంతా సహజంగానే ఉంది! కనుక ఇంకేదో కారణం అయి ఉండాలి–"

"అవును?" అన్నాడు రంగారెడ్డి.

గోపాత్రావ్, జనార్ధన్ కూడా శాయిరామ్ అభిప్రాయంతో ఏకీభవించారు.

తిండిపోతు వెంకట్రావ్ నెమ్మదిగా జనాన్ని తోసుకుంటూ చేతిలోని కారెట్ తింటూ స్టేజి దగ్గరకొచ్చాడు తన భారీకాయంతో.

"ఈ సందర్భంలో మీకో విషయం చెప్దామని వచ్చాను!" అన్నాడతను కారెట్ ఇంకో ముక్క కొరుకుతూ.

"ఇలా మైకు ముందు నిలబడు!" పిలిచాడు రంగారెడ్డి.

మైకుముందు నిలబడి మిగతా కారెట్ అంతా నోట్లో పెట్టేసుకుని నములుతూ మాట్లాడాడు వెంకట్రావ్?

"జరిగిందేమిటంటే నాల్రోజుల కిందట మా అన్నయ్య గారబ్బాయ్ కూడా ఇలాగే వింతగా మాట్లాడటం మొదలు పెట్టాడు! ఆ రోజు మా వదిన వంకాయ మషాలా కూర వండింది. బాగా గుర్తు నాకు! కూరలో కొంచెం కారం తక్కువయింది కూడాను–నేను బగారా బైగన్ వండమంటే వినకుండ వంకాయ వండినందుకు తగిన శాస్తి జరిగిందని అంటే ఆమెకు కోపం కూడా వచ్చింది."

అతనిని చప్పున ఆపకపోతే ఆ మీటింగ్‌ని బగారా బైగన్ సంస్మరణ సభగా మార్చేస్తాడని మాకందరికీ అనుమానం కలిగింది.

"చూడు  వెంకట్రావ్– నువ్వు 'కూరలు, మానవుల ఆహారం' అనే టాపిక్ వదిలేసి అసలు విషయమేదో చెప్తే బాగుంటుంది.." అన్నాడు రంగారెడ్డి.

వెంకట్రావ్ ఆ టాపిక్ ఆపేసి జేబులోంచి ఓ గుప్పెడు కార్న్‌ఫ్లాక్స్ తీసి నోట్లో నింపాడు.

"జరిగిందేమిటంటే, నాల్రోజుల క్రిందట మా అన్నయ్యగారబ్బాయ్ కూడా ఇలాగే స్కూలునుంచి ఇంటికొచ్చి పిచ్చి మాటలు మాట్లాడాడు.

"బాబాయ్ నా కళ్ళకు రాకొమార్తె కనబడుతోంది. నా మనోవేదన ఎక్కువయి పోయింది. మనోవేదన చల్లారేందుకు చందన గృహానికెళ్ళి చంద్రకాంత శిలావేదికపై కూర్చున్నా గాని మనశ్శాంతి లభించటం లేదు.. తలుచుకుంటే ఒళ్ళు గగుర్పాటు చెందుతోంది. ఆమెతో ప్రణయ విహారం చేస్తూ కుసుమాకరమనే ఉద్యానవనం చేరుకోవాలి" అంటూ మాట్లాడట మొదలుపెట్లాడు.

"ఏమిటా పిచ్చి వాగుడు? నీ వయసుకలాంటి ప్రేలాపనలు పేలవచ్చా?" అంటూ బెల్టు తీసుకుని వాడిని చావగొట్టాడు మా అన్నయ్య– కానీ వాడు ఏడుస్తూ చెప్పిందేమిటంటే ఆ వర్ణనంతా వాడి ఏడో క్లాసు ప్రభుత్వ తెలుగు వాచకంలో ఉందిట. అంచేత టీచర్ ఆ విరహ వేదనంతా వాళ్ళ మనసు కెక్కేట్లు విరంగా చెప్పిందట– అప్పటినుంచీ వాళ్ళకందరికీ కూడా వళ్ళంతా గగుర్పాటు చెందటం ఇంకేదో– ఏదోగా అవటం– జరుగుతోందిట–"

అందరూ నిశ్శబ్దం అయిపోయారు.

"కనుక నేను చెప్పేదేమిటంటే– రమేష్ గాడికి కూడా వాడి తెలుగు టెక్ట్స్ పుస్తకం తాలూకు ప్రభావం ఏమయినా సోకిందేమోనని...."

అందరూ ఒకరి మొఖాలొకరు చూచుకున్నారు.

"మీ అన్నయ్య కొడుకు వర్ణించిన వర్ణన ఏ పాఠంలో ఉంది?" కల్చరల్ సెక్రటరీ పార్వతీదేవి అడిగింది. పెన్నూ నోట్ పుస్తకం తీసుకుంటూ.

"జీమూత వాహనుడు అనే పాఠంలో" మరో గుప్పెడు వల్లీ బఠానీలు నోట్లో నింపుకుంటూ చెప్పాడు వెంకట్రావ్.

అందరూ కాసేపు తమలో తాము మాట్లాడుకున్నారు.

హఠాత్తుగా కాలనీ కవి విప్లవజ్యోతి రౌద్రంగా మైక్ దగ్గర కొచ్చాడు.

"అంతేకాదు! అదే వెధవ సెవెన్త్ క్లాస్ తెలుగు టెక్ట్స్ పుస్తకంలో ఇంకో పద్యం ఉంది!  దానర్థం ఏమిటంటే మానం కాపాడుకోవటానికి స్త్రీ మంటల్లో దూకుతేనే ఆమెకు కీర్తి లభిస్తుంది" అని! అది చదివి మా అమ్మాయి మంటల్లో దూకుతేనే ఆడదాని జీవితం ధన్యమవుతుందనే అభిప్రాయనికొచ్చేసింది. మన దేశంలో పౌరుల మనస్తత్వాన్ని మన

తెలుగు టెక్ట్స్ పుస్తకాలు ఎంత చక్కగా తీర్చిదిద్దుతున్నాయో చెప్పేందుకు మరో ఉదాహరణ ఇది!" అవేశంగా అరచాడతను.

పార్వతీదేవి మళ్ళీ పెన్నూ నోట్ పుస్తకం తీసుకుంది.

"ఆ పద్యం ఏ పాఠ్యభాగంలో ఉంది" అడిగిందామె.

"కన్యక" అనే గేయ సంపుటి! పేజి నెంబర్ ఇరవైఏడు-"

అంతా కలకలం చెలరేగింది.

"ఇదెక్కడి అన్యాయం- గవర్నమెంటోళ్ళు ఇలాంటి చెత్తరాతలన్నీ రాయించి అభం శుభం తెలీని చిన్న పిల్లలతో చదివిస్తున్నారా? అయ్యో- అయ్యో వాళ్ళకేం పోయేకాలమొచ్చింది?" గట్టిగా అరచింది విమలాదేవి.

శైలజమ్మ పక్కనున్న ఇద్దరినీ చెరో వేపుకు తోసేసి ఆవేశంగా ముందుకొచ్చింది.

"అయ్యో అదొక్కటే కాదండీ! మాచెల్లెలి వాళ్ళ తెలుగువాచకంలో కూడా ఇంద్రజిత్తు భార్య సతీసులోచన సతీసహగమనం చేయటం చాలా గొప్ప కీర్తివంతమయిన పని అని రాశారు. పైగా ఆ సహగమనాన్ని అందరూ వేనోళ్ళ స్తుతించారట! సతీసహగమనాన్ని ఈ విధంగా మన ప్రభుత్వమే ఎంకరేజ్ చేస్తోందన్న మాట!"

అంతా హాహాకారాలు చెలరేగాయ్.

విప్లవజ్యోతి మళ్ళీ ఆవేశంగా స్పీచ్ మొదటు పెట్టేశాడు.

"ఇదండీ- మన తెలుగుదేశ ప్రభుత్వం చేసిన ఘనకార్యం! మన ముఖ్యమంత్రి గారు అర్థరాత్రి నిద్రలేపి, "తెలుగు సంస్కృతి, తెలుగు ప్రజల ఆత్మగౌరవం- తెలుగుభాష" అంటూ కలవరింతలు కిలోల్లెక్కన ఇస్తారు! ఆ తెలుగు సంస్కృతీ, తెలుగు ప్రజల ఆత్మ గౌరవం, తెలుగు భాషలను మన ప్రభుత్వమే మన ప్రభుత్వ టెక్ట్సు పుస్తకాల ద్వారా నడిబాజార్లో వేలం వేస్తోంది! మనల్ని కించపరుస్తోంది"- అన్నాడాయన.

అంతవరకు నిశ్శబ్దంగా ఉన్న జనంలో కలకలం చెలరేగింది.

"అదేమిటి? ఈ విప్లవ జ్యోతి మన 'ఎన్.టి.ఆర్.' అన్న మీద విరుచుకుపడతాడేం మధ్యలో అన్నగారికేం తెలుసని?" అంది పార్వతీదేవి.

"అహ్హహ్హహ్హ-" వికటంగా నవ్వాడు విప్లవజ్యోతి." తెలుగు వాచకాలు ఎవరు అచ్చు వేయిస్తున్నారు? ప్రభుత్వం! ప్రభుత్వమంటే ఎవరు! అన్నగారు! అహ్హహ్హహ్హ- మరి ఈ తప్పు ఇంకెవరిది?"

''ఒరేయ్-'అన్న' నేమయినా అన్నావంటే మంచిగుండదు.'' జనంలోచి కుర్రాళ్ళు అరచారు.

"మంచిగుండదా? నేనంటా! ఏం జేస్తావ్?" అంటూ ఆ విప్లవజ్యోతి ఆ కుర్రాళ్ళవేపు దూసుకెళ్ళబోయాడు.

శాయిరామ్, రంగారెడ్డి పరుగుతో వెళ్ళి ఆకస్మిక యుద్ధాన్ని నివారించేశారు.

''సోదరులారా- మనం మన తెలుగు వాచకాల తీరుతెన్నుల గురించి మాట్లాడుతున్నాం గానీ- రాజకీయాల గురించి కాదు! ఇప్పుడు నేను మా రాజిగాడి రెండో తరగతి తెలుగువాచకంలో కొన్ని జోకులు లేక కొన్ని బూతులు చదువుతాను! అందరూ నిశ్శబ్దంగా విని నన్నానందింప జేయవలసిందిగా కోరుతున్నాను-"

అందరూ నిశ్శబ్దమయిపోయారు.

రెండోతరగతి వాచకం-

ఐదోపాఠం- నాకథ-

పేజీ ఇరవై ఎనిమిది!

"బ్రిటిష్ వారు మనల్ని బానిసలుగా చూస్తున్నారు. మరో దేశం వారు మనకి అన్యాయం చేయడమేమిటి? నాకు బాధ కలిగింది! అందుకే బ్రిటిష్ వారితో పోరాడదలిచాను..."

ఇక్కడ ఒక క్షణం ఆపాడు రంగారెడ్డి.

"మరో దేశం వారు మనకి అన్యాయం చేస్తున్నారట. అందుకని గాంధీ గారికి బాధకలిగి బ్రిటిష్ వారితో పోరాడారట! ఇంతకంటే పెద్ద జోక్ ఇంకేమయినా వుంటుందా? బ్రిటిష్ వారు మనకి అన్యాయం చేయకపోతే వారిని అలాగే పరిపాలన చేయనిస్తారా? అదలా ఉండనీయండి మరో దేశంవారు మనకి అన్యాయం చేస్తున్నారు కాబట్టి గాంధీగారికి బాధ కలిగిందట! అంటే మన దేశంవారే మనకి అన్యాయం చేస్తే ఫరవాలేదనేగా దాని అర్థం?"

అంతా నవ్వులూ తప్పట్లూ మార్మోగి పోయినయ్.

"ఇంకో జోక్ చదవండి" అరచారు స్టూడెంట్స్.

అదే పాఠం - 29వ పేజీలో.

''నేను ప్రజలకు సత్యాగ్రహం గురించి చెప్పినాను. ఒకరు మనల్ని కష్టపెడుతున్నారనుకోండి! మనం ఓర్చుకుంటూ వారి మనస్సు మారేటట్లు చేయవలె? అదే సత్యాగ్రహంటే!"

"చూశారా? సత్యాగ్రహం అంటే మనస్సు మార్చటమట!"

అందరూ ఘొల్లున నవ్వారు.

"ఇంకో జోక్- ఇంకో జోక్-" అరచారు కొంతమంది ఉత్సాహంగా. రంగారెడ్డి మళ్ళీ ఉత్సాహంగా అందుకున్నాడు.

"తెలుగు భాష గురించిన పాట- 32వ పేజీలో-

"అమ్మను పిలిచే భాష

తమ్ములు పలికే భాష

చెల్లెలి అల్లరి భాష

పిల్లల చల్లని భాష–"

అంటే తెలుగు భాష కేవలం పిల్లలే మాట్లాడేది అన్నమాట! లేదా తమ తల్లిని పిలవటానికి కూడా తెలుగు భాషను ఉపయోగిస్తారు–"

ఈసారి తప్పట్లు కూడా మార్మోగినయ్.

విప్లవజ్యోతి మళ్ళీ రౌద్రంగా మైక్ దగ్గరకొచ్చి నన్నూ, శాయిరామ్‌ని ఒక్కతోపుతోసి మైక్ అందుకున్నాడు.

"ఇప్పుడేమంటారు? తెలుగుభాష తెలుగు ప్రజలు అంటూ శోష వచ్చేవరకూ చైతన్య రథంలో ఉపన్యాసం ఇస్తారుగా మీ అన్నగారు? ఇదేనా ఆయన మన తెలుగుతల్లి పిల్లలకు నేర్పే తెలుగుభాష" వెటకారంగా అన్నాడతను.

మళ్ళీ అందరం కలసి విప్లవజ్యోతిని వెనక్కు లాగేశాము.

రంగారెడ్డి మళ్ళీ అందుకున్నాడు.

"కొబ్బరిచెట్టు" పాఠం 36వ పేజీ...

మనకు ఈ పాఠంలో చాలా కొత్త విషయాలు తెలుస్తాయ్–

"కొబ్బరి నూనె రాస్తే తల వెంట్రుకలు నిగనిగలాడి జుత్తు ఒత్తుగా పెరుగుతుందట–"

అందరూ ఘోల్లున నవ్వారు

"నేను రోజూ కొబ్బరి నూనె రాస్తాను"

అన్నారు అవధాన్లు గార్లు ముప్పయ్ రెండో ఏట తనకు సంక్రమించిన బట్టతలను చూపిస్తూ.

మళ్లీ నవ్వులూ కేకలూ–

"అంతేకాదు. పెళ్ళి పందిరిని కొబ్బరి మట్టలతోనే వేస్తారట."

"మళ్ళా నవ్వులు–"

"బాలచంద్రుడు పాఠం– 73వ పేజీ"

బాలచంద్రుడు తన బొంగరాన్ని అరచేతిలో నిలబెట్టి, తాడు చుట్టి, గిర్రున తిప్పి 'హుమ్ హుమ్' అంటూ నేలకేసి విసిరాడట!

ఆ తరవాత– 77వ పేజీలో–

"బాలచంద్రుడు 'హుమ్' అన్నాడట సైనికుల పారిపోయానారట" అంటే దీనిని బట్టి తెలుగు సినిమాల్లో హాస్యగాడికి ఓ ఊతపదం వున్నట్లే ఆనాడు బాలచంద్రుడికి కూడా 'హుమ్' అనే ఊతపదం ఉండేదన్నమాట? అంటే ఈ పాఠాన్ని తెలుగు సినిమాల్లో హాస్యగాడి పాత్రను సృష్టించిన రచయితే రాశాడన్నమాట."

మళ్ళా నవ్వులు!

కొంతమంది "హుమ్" అని అరచారు వెనకనుంచీ.

విమానం పాఠం - 83వ పేజీ.

"విమానం అంటే ఇనుప పక్షి ఆట. అంటే ఈ పాఠం తయారుచేసిన వాళ్ళకి విమానాన్ని ఏ లోహంతో తయారుచేస్తారో కూడా తెలీదన్నమాట."

మళ్ళీ హహాకారాలు చెలరేగాయ్.

రంగారెడ్డి అందరికీ వినయంగా నమస్కరించి వెనక్కు వెళ్ళిపోయాడు.,

వెంటనే శాయిరామ్ మైక్ దగ్గరకొచ్చాడు.

"ఇంకెవరయినా తమ పిల్లల ప్రభుత్వ టెక్ట్స్ బుక్స్‌లోని జోకులు కానీ బూతులు కానీ చదివి వినిపించదల్చుకుంటే ఇక్కడికి రావచ్చు." అన్నాడు ఉత్సాహంగా.

సదాశివరావ్ వాళ్ళ అబ్బాయిని కూడా తీసుకొచ్చాడు మైక్ దగ్గరకు. "సోదరులారా! మా అబ్బాయిని ఓ నిముషం మీ అందరి ఎదురుగ్గా మాట్లాడిస్తాను. దయచేసి వినండి!" అన్నాడు.

"ఏరా బాబీ! నువ్వు స్కూలుకెలా వెళ్తావ్ చెప్పమా!" అడిగారాయన గారాబంగా.

"బస్‌ని కరుచుకునెళ్తా" అన్నాడు వాడు.

అంతా ఘొల్లున నవ్వారు.

"అమ్మ భోజనం వడ్డించిందనుకో! ఏం చేస్తావ్"

"కరుచుకుంటూ"

మళ్లీ నవ్వులు

"స్కూల్లో ఏం చేస్తావ్ నువ్వు?"

"కరచుకుంట"

సదాశివరావ్ మళ్ళా అందరికీ నమస్కరించాడు.

"అయ్యా ఇదండీ మా వాడికి వచ్చిన తెలుగు! సంగతేమిటని టీచర్ని అడిగితే."

మేమేం కరుచుకోమండీ? మూడో క్లాస్ తెలుగు వాచకంలో అలా కరుచుకోటం గురించి కరచారు" అంది.

ఆయన వెళ్లిపోగానే రామచంద్రరావ్‌గారు వాళ్ళమ్మాయిని తీసుకొచ్చారు. మైక్ దగ్గరకు.

"అయ్యా, తెలుగువాచకమే కాదు! హిందీ టెక్ట్స్ పుస్తకం కూడా మన పిల్లల్ని మరింత అధోగతికి దిగజారుస్తోంది. మా అమ్మాయి ఏడో క్లాస్ చదువుతోంది. ఆమె చెప్పే సమాధానాలు విని తరించండి..."

అంతా చెవులు రిక్కించారు.

"చెప్పమ్మా! స్వర్ణా! తెలుగులో చక్కని సాహిత్య సృష్టి చేసి తెలుగు భాషకు గొప్ప

సేవ జేసిన రచయిత ఎవరు?"

"మాదిరెడ్డి సులోచనరాణి..."

అందరూ ఘొల్లున నవ్వారు.

"అయ్యా! నవ్వకండి! ఇది మన పదోతరగతి హిందీ పుస్తకం. తయారుచేసిన వారి అభిప్రాయం! మన తెలుగు ప్రభుత్వం వారు చెప్తోన్న నగ్నసత్యం! శ్రీమతి మాదిరెడ్డి సులోచన మన తెలుగు భాషలో ఉన్న కొన్ని వందలమంది రచయిత(తు)లలో ఒకరు. వ్యాపార సరళిలో రచనలు చేయటం తప్ప తెలుగు సాహిత్యానికి గానీ, సంస్కృతికి గానీ చేసిన మేలేమీ లేదు. పైపెచ్చు అంతకంటె ఎన్నో విధాలుగా గొప్ప రచనలు చేసిన వారెంతో మంది ఉన్నారు. అయినా మన సిలబస్ కమిటీకి, ప్రభుత్వానికీ ఆ పుస్తకం ఎడిటరు గారికీ ఆవిడ రచనలే ఉత్తమ సాహిత్యం అనిపించింది. ఆమె పేరు కందుకూరి వీరేశలింగం గురజాడ అప్పారావ్‌ల స్థాయికి తీసుకెళ్ళారు"

"షేమ్ షేమ్–" అరచారెవరో.

హఠాత్తుగా విప్లవజ్యోతి మళ్లీ అందరినీ పక్కకు తోసి మైక్ దగ్గరకు చేరుకున్నాడు.

"అమ్మలారా, అయ్యలారా! ఇప్పుడయినా అన్నగారి అవకతవకల భాగోతం తెలుసుకున్నారా? తెలుగు సంస్కృతీ, తెలుగుభాష, తెలుగు ఆత్మగౌరవం– అహ్హహ్హహ్హా– మాదిరెడ్డి సులోచనరాణి అన్నట్లు మర్చిపోయాను– ఆవిడ పేరు కూడా ప్రభుత్వానికి, పాఠ్యపుస్తకం ఎడిటర్స్‌కి తెలీదు– 'సులోచన' అని ఉండాల్సింది– సులోచనరాణి అయిపోయింది. పేరు కూడా ఎవరికీ సరిగ్గా తెలీని రచయిత్రి జీవిత చరిత్ర గురించి మన తెలుగు బాలబాలికలందరూ నేర్చుకుని తరించాలిట! కేవలం నాలుగు డబ్బులు సంపాదించటం కోసమే వ్యాపారం చేస్తున్న పబ్లిషర్లు కొంతమందికి ఆమె సేవ జేసి ఉండవచ్చు – అంతమాత్రాన ఆ సాహిత్యాన్నంతా గొప్ప సాహిత్యంగా భావించి– మన చిన్నారి బాలల మనసులను కలుషితం చేయటం అక్రమం– దారుణం! ఇది మీ ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే జరగటం ఇంకా ఘోరం– మనందరికీ అవమానం–"

ఈసారి ఎవ్వరూ అతనిని హేళన చేయలేదు.

"హా! తెలుగుజాతి– తెలుగుభాష తెలుగు– ఆత్మగౌరవం– ధూ! నీయవ్వ" అనేసి మైక్ దగ్గర్నుంచి హడావుడిగా వెళ్ళిపోయాడు.

అంతా నిశ్శబ్దం అయిపోయారు.

శాయిరామ్ నెమ్మదిగా మైక్ ముందుకొచ్చాడు.

"సోదర సోదరీమణులారా! ఈ తెలుగు వాచకాలు మన పిల్లలందరినీ ఎంతగా హింసిస్తున్నాయో ఇప్పుడు అర్థమయింది. మనకాలనీవాసి యాదగిరి వాళ్ళబ్బాయ్ పిచ్చి మాటలు కూడా కేవలం తెలుగువాచకాల వల్లనె జరిగిందని నా అనుమానం–"

"అనుమానం కాద్సార్– నిజమే అది" ఓ ముసలాయన జనంలోంచి మైక్ దగ్గరకొచ్చాడు.

"నాపేరు దశరథరామయ్యండీ! నేను యాదగిరి వాళ్ళ అబ్బాయి చదివే స్కూల్లో తెలుగు టీచర్ని. యాదగిరి వాళ్ళబ్బాయి పిచ్చి మాటలు మాట్లాడడం కేవలం నా పొరపాటు వల్ల జరిగిందని మీకు సవినయంగా మనవి చేస్తున్నాను. జరిగిందేమిటంటే యాదగిరి వాళ్ళ ఇద్దరు అబ్బాయిలూ యించుమించుగా ఒకే పోలికలతో ఉంటారు. అంచేత పొరబాటున యాదగిరి రెండో కొడుకుని వాళ్ళ పెద్దాబ్బాయి అనుకుని వేరే క్లాస్‌కి బలవంతంగా లాక్కెళ్ళి ఆ క్లాసు తెలుగువాచకం చదివించాను, మరి ఇంత లేత పిల్లలు అలా రెండు తెగులు వాచకాలు చూసేసరికి కొంచెం మతిచలించడం సహజమే! ఇందుకు ప్రాయశ్చిత్తంగా నేనే నా ఖర్చు మీద ఆ కుర్రాడిని మంచి సైకాలిజిస్ట్‌కి చూపించి నయం చేయగలనని మనవి చేస్తున్నాను."

అతను యాదగిరి కుర్రాడిని రిక్షాలో తీసుకువెళ్ళిపోయాడు.

శాయిరామ్ ఉత్సాహంగా మళ్ళీ మైక్ దగ్గరకు వచ్చాడు.

"సోదర సోదరీమణులారా! మన పిల్లందరి క్షేమం కోసమని మన కాలనీ సభ్యులు కొంతమందితో ఓ కమిటీ ఏర్పాటు చేయడానికి నిర్ణయించామని చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నాము. ఈ కమిటీవారు తెలుగు వాచకాల్లోని తప్పులను గుర్తించి, ప్రభుత్వానికి తెలుగులో తమ రిపోర్ట్‌ను సమర్పిస్తారు." అంతా తప్పట్లుకొట్టారు.